
నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 22 జూన్ 2024 | NAGARKURNOOL



వనపర్తిలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# స్ఫూర్తి ప్రదాత జయశంకర్

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 21 : తెలంగాణ పోరాట స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని.. పదేండ్ల బీఆర్ఎస్ ప్రగతి పాలనలో ఆయన స్ఫూర్తి ఇమిడి ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం సమీపంలోని రాక్‌ఉడ్ పార్కులోని జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సాధిస్తామని నమ్మి రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన మహనీయుడు జయశంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, స్ఫూర్తిని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు నాగన్నయాదవ్, కంచె రవి, బీఆర్ఎస్ నాయకులు అశోక్, మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, ఉంగ్లమ్ తిరుమల్, రహీం, గోవర్ధన్‌చారి, వెంకటేశ్వరాచారి, మహేశ్వర్‌రెడ్డి, జోహెబ్, రాము, శ్రీను, సురేశ్, మోహనాచారి, రమేశ్, చాణక్య, కృష్ణ పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

- యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



యోగాసనం వేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 21 : ఆరోగ్యమే మహాభాగ్యం..మానవుని శరీరం సహకరిస్తే ఏపనినైనా సులువుగా ఛేదించగలమని అందుకు యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా పతంజలి యోగా సమితి-భారత స్వాభిమాన్ ట్రస్ట్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా సాధకులతో కలిసి మాజీ మంత్రి వృక్షాసనం, వక్రాసనం, భస్త్రిక, కపాలాభాతి, అనులోమ వినులోమ, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, సమానత్వం, సహకార స్ఫూర్తి కేవలం యోగా ద్వారానే సాధ్యమైతుందని, దీనిని ప్రతినిత్యం అలవర్చుకొంటే పనిఒత్తిడిని కూడా అధిగమించవచ్చన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణలోనే మహబూబ్‌నగర్‌కు క్రీడా మైదానానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో రూ.9 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు రాంలక్ష్మణ్, అనంత్‌రెడ్డి, నాయకులు శివరాజ్, నవకాంత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ దార్శనీకుడు..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 21 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను ప్రజల గుండెలోతుల్లోకి తీసుకెళ్లి ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన సిద్ధాంతకర్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జయశంకర్ 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద ఉన్న జయశంకర్‌సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సిద్ధాంతకర్తగా తెలంగాణ నాయకత్వానికి మార్గదర్శనం చేసిన గొప్ప దార్శనికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

# జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దాం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూన్ 21 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన జయశంకర్‌సార్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టుక నీది.. చావు నీది.. నడుమ జీవితమంతా తెలంగాణది.. అనే నినాదాన్ని నమ్మి ఆచరించిన వ్యక్తి జయశంకర్ సార్ అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమ పోరాట మే కాకుండా రాజకీయ ప్రక్రియ అవసరమని కేసీఆర్‌కు మార్గనిర్ధేశం చేసిన గురువు జయశంకర్ సార్ అన్నారు. చదువుకునే రోజుల్లోనే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించిన ధీరోదాత్తుడన్నారు. తన 50ఏండ్ల పోరాటకాలంలో మూడు దశల తెలంగాణ పోరాటాలకు ప్రత్యక్ష సాక్షి అని అన్నారు. యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తెలంగాణ రావాల్సిన ఆవశ్యకతను వివరించడానికి తానే స్వయంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో సమర చైతన్యాన్ని నింపిన వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలి

- పదరలో రాస్తారోకో

అమ్రాబాద్, జూన్ 21 : పదర మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని గ్రామ యువకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థులతో కలిసి గ్రామ యువకులు పదర-మద్దిమడుగు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం వడ్డించడం లేదని, దీంతో విద్యార్థులు ఆకలితోనే ఉంటున్నారన్నారు. హెచ్ఎంను అడిగితే ఇంటికెళ్లి తిని రావాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, గ్రామస్తులు వెళ్లి అడిగినా ఆయన నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎంఈవో బాలకిషన్ విద్యార్థులకు వెంటనే మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వివేకానంద యు వజన సంఘం అధ్యక్షుడు ప్రశాంతాచారి, రామ్‌యాదవ్, రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.



పదరలో రాస్తారోకో నిర్వహిస్తున్న యువకులు, విద్యార్థులు

## కేసీఆర్ ప్రభుత్వంలోనే బాగుండే..



సీఎంగా కేసీఆర్ కొనసాగిన పదేండ్లలో కరెంట్ కోతలను ఎప్పుడూ చూడలేదు. అసలు కోతల గురించే మరిచిపోయినం. అంతకు ముందు పగలు రాత్రి తేడా లేకుండా గంటలకొద్దీ కోతలు ఉండేవి. అప్పట్లో కరెంట్ సరఫరాలకు వేళలు కూడా ఉండేవి. కానీ, కేసీఆర్ మాత్రం 24గంటల కరెంట్ ఇచ్చి తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు చేశారు. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇష్టమొచ్చినట్లు కోతలు విధిస్తోంది. ఈ వర్షాకాలంలోనూ ఎండలు దంచి కొడుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఉక్కపోతలను భరించలేకపోతున్నాము. ఈ పరిస్థితుల్లో కరెంట్ కోతలు విధిస్తుంటే బాధలు చెప్పలేక పోతున్నాము. ఇంట్లో ఫ్యాన్లు తిరగక పిల్లలు అల్లాడిపోతున్నారు. ఇక రాత్రి పూట అయితే చినుకు పడిందంటే చాలు వెంటనే కరెంట్ పోతుంది. చీకట్లో జాగారం చేయాల్సి వస్తున్నది.

*- సంద సరస్వతి, శాఖాపురం, పెబ్బేరు మండలం*



# పదేండ్లు పవర్‌ఫుల్

ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోతలతో సతమతమయ్యాం.. ఎప్పుడొస్తుందా.. అని వెయ్యి కండ్లతో ఎదురుచూసిన రోజులు నాటివి.. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో వెలుగులు ప్రసరింపజేసింది. గృహ, వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేసింది. బోరు, బావులకు విద్యుత్ సమస్యలు లేకపోవడంతో నిరంతరం నీటిని ఎత్తిపోశాయి. పదేండ్ల కాలంలో సాగు సంబురంగా సాగింది. వ్యాపారులు, చిన్న, భారీ పరిశ్రమలకు సైతం పవర్‌ఫుల్‌గా సరఫరా అయ్యింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాటి వెలుగు జిలుగులు మాయమయ్యాయి. కరెంట్ 'కట్'కటతో కర్షకులు సతమతమవుతున్నారు. రాత్రిళ్లు పొలాల వద్ద జాగరణ చేస్తున్నారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ సర్కారు లేనిపోని అభాండాలు వేస్తున్నది. నాడు రాష్ట్రంలో కరెంట్ కష్టాలను తీర్చిన అధినేతను బదనాం చేసే కుట్ర జరుగుతున్నది. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– మహబూబ్‌నగర్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- బీఆర్ఎస్ హయాంలో నిరంతర వెలుగులు
- ఉచిత కరెంట్‌తో సంబురంగా సాగు
- చిన్న, భారీ పరిశ్రమలకు కోతల్లేకుండా సరఫరా
- ఇప్పుడు కేసీఆర్‌ను బదనాం చేయడం తగదు



కాంగ్రెస్ పాలనలో
## కరెంట్ కోతలు

- ఆరు నెలల్లోనే ఆగమైన రైతులు
- ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి
- మళ్లా పొలాల వద్ద జాగరణలు
- పాత రోజులు మళ్లొచ్చాయని మదనపడుతున్న అన్నదాతలు

## కేసీఆర్ సారే కరెంట్ బాగిచ్చిండు..



బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి 24గంటలు కరెంట్ ఇచ్చేటోళ్లు. దీంతో బోరు బావుల కింద పంటలు సమృద్ధిగా పండించేవాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కరెంట్ కోసం కష్టాలు తప్పడం లేదు. పది రోజుల కిందట వర్షం పడితే పత్తి విత్తనాలు నాటుకున్నాం. మొలకలు రాకపోవడంతో బోరు బావుల ద్వారా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకొని విత్తనాలను బతికించుకుందామని ప్రయత్నిస్తుంటే కరెంట్ సక్రమంగా ఉండడం లేదు. కరెంట్ వచ్చిన వెంటనే రైతులందరూ మోటర్లు ఆన్ చేయడంలో చాలా వరకు మోటర్లు కాలిపోతున్నాయి. పదేండ్లలో మోటర్లు కాలిపోయిన ఘటనలు లేకుండా కాంగ్రెస్ రావడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

*- బాలయ్య, రైతు, తాడూరు*

## కోతలతో నిత్యం ఇబ్బందులు..



*- విజయ్‌కుమార్, కేవీపీఎస్ రాజోళి మండలాధ్యక్షుడు*

రాజోళి మండల కేంద్రంలో నిత్యం కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అంతరాయం అంటూ నిత్యం కోతలు పెడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా కోతలపై స్పందించడం లేదు. పునరావాస కేంద్రాలు, దళిత కాలనీల్లో కరెంట్ లైన్ లేక చిమ్మచీకట్లో మగ్గుతున్నారు. విషపురుగుల సంచారంతో నిత్యం వారు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి.

## కష్టాలు మరింత పెరిగాయి..



కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు మరింత పెరిగాయి. పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నా పట్టించుకునే నాయకుడు, అధికారులు లేరు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు 24గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చారు. కానీ రేవంత్‌రెడ్డి హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని అయోమయం నెలకొంది. రోజుకు 9గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదు. రేవంత్‌రెడ్డి రైతులపై కక్ష పెంచుకొని కరెంట్ ఇవ్వకుండా, రైతు బంధు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.

*- గౌని శ్రీనివాసులు, రైతు, ఎంనోనిపల్లి, ధన్వాడ మండలం, నారాయణ పేట జిల్లా*

## ఉపాధి కోల్పోతున్నాం..



అప్రకటిత విద్యుత్ కోతలతో మాలాంటి చేతివృత్తిదారులు ఉపాధి కోల్పోవాల్సి వస్తున్నది. కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ కోతల వల్ల గిరాకీ పోగొట్టుకోవాల్సి వస్తున్నది. రోజు ఆదాయం తగ్గి కుటుంబ పోషణ భారమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పని కరెంట్ మీదే ఆధారపడాల్సి వస్తున్నది. హేర్ కటింగు షాపులకు ముఖ్యంగా ఉదయం పూటనే గిరాకీ ఉంటుంది. ఆ సమయంలోనూ కరెంట్ ఉండటం లేదు. కొన్ని సందర్భాల్లో మధ్యలోనే పనిని ఆపి కరెంట్ కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది. గత ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ ఉండేది. ఇప్పుడా పరిస్థితులు లేవు.

*- దొడ్ల జ్ఞానేశ్వర్, సెలూన్ షాపు, చెలిమిల్ల, పెబ్బేరు మండలం*

# పోలీసుల నిర్లక్ష్యం వల్లే వరుస చోరీలు

- పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..
- చోరీలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా..
- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అర్బన్, జూన్ 21 : గద్వాల ప్రాంతంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని వేదనగర్ కాలనీలో వీరప్రసాద్ ఇంట్లో గుర్తు తెలియని దుండగలు చొరబడి చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరప్రసాద్ తన కుటుంబ సభ్యులతో నంద్యాల ప్రాంతానికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేనిది చూసిన దుండగులు ఇంట్లోకి చొరబడి 30తులాల బంగారు, రూ.3,50,000 నగదును అపహరించుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం చోరీకి గురైన ఇంటిని పరిశీలించి బాధితుడు వీరప్రసాద్‌ను పరామర్శించారు. ఘటనా స్థలాన్ని సీఐ భీమ్‌కుమార్ పరిశీలిస్తుండగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి.. పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు నిద్రపోతున్నారా అని నిలదీశారు. ఈ రెండు, మూడు నెలలో జిల్లా కేంద్రంలో దాదాపు 200పైగా దొంగతనాలు జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి దొంగతనాలు లేకుండా శాంతిభద్రతలు కాపాడుతూ పోలీస్ వ్యవస్థ పనిచేసేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రజలు కష్టపడి సంపాదించుకొని దాచుకున్న డబ్బు దొంగల పాలు అవుతున్నది. ప్రజలను రక్షించలేని పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికే వరుస దొంగతనాలపై డీఎస్పీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఇదేవిధంగా భవిష్యత్తులో జరిగితే రాష్ట్ర పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేస్తానని, ఈ విషయంపై త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రస్తావిస్తానన్నారు. జిల్లా కేంద్రంలో నా సొంత ఖర్చులతో దాదాపు రూ.30లక్షల వ్యయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా.. లేవా ? పోలీస్‌లు పట్టించుకోవడమే లేదా అని ప్రశ్నించారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరిగితే ప్రజల కోసం ఎంత దూరమైనా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, బాబర్, నాగిరెడ్డి, శ్రీనివాసులు, షూకూర్, గోవిందు, ధర్మనాయుడు, అజయ్, రిజ్వాన్, మోబీన్, విజయ్, వీరేశ్ తదితరులు ఉన్నారు.

# ఏరువాక సాగారో..

- నేడు రైతు పండుగ ఏరువాక పౌర్ణమి
- నడిగడ్డలో ప్రసిద్ధి
- ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్న రైతులు
- ఎన్నో విశిష్టతలకు ప్రతీక ఈ పౌర్ణమి

***నాగరికత ఎంత ముందుకు సాగినా.. సైన్స్ పరంగా ఎంత అభివృద్ధి సాధించినా.. నాగలి లేనిదే పని జరగదు.. దుక్కి దున్నందే తినడానికి తిండి దొరకదు.. రైతు లేనిదే పూట గడవదు.. పట్టెడన్నం పుట్టదు.. జాతికి వెన్నెముకగా నిలిచిన రైతన్నలు జరుపుకొనే పండుగే ఏరువాక పౌర్ణమి.. ఈ వేడుకను ఘనంగా జరుపుకొనేందుకు నడిగడ్డ ప్రాంత రైతులు, ప్రజలు సిద్ధమయ్యారు.***

*- గద్వాల టౌన్, జూన్ 21*



మరికల్: ఏరువాకతాడు కోసం పోటీ పడుతున్న రైతులు

వ్యవసాయదారులు(రైతులు) ఏరువాక పండుగను జేష్ఠ్య పౌర్ణమి నాడు జరుపుకుంటారు. తెలుగు సంవత్సరంలో జేష్ఠ్యమాసం అంటే మూడో నెల. ఈ నెల మొదటి పక్షంలో రోహిణికార్తె తరువాత మృగశిర కార్తె వస్తుంది. ఈ కార్తెలో ఎండల ప్రభావం తగ్గి ముంగిళ్లు చల్లబడతాయన్న నానుడి ఉన్నది. అంతేకాదు జ్యేష్ఠపౌర్ణమి నాటికి తొలకరి పలుకరించక మానదు. ఇందుకు కృతజ్ఞతాపూర్వకంగా జరుపుకొనే పండుగను కృషి పూర్ణిమ, మాల పూర్ణిమ, ఏరువాక పూర్ణిమ అంటారు. ఏరువాక అంటే నాగలితో దుక్కి ప్రారంభించడమన్న అర్థం ఉంది. ఆరుగాలం పొలాల్లో తమతోపాటు శ్రమించే పశువులను ఏరువాక నాడు పూజిస్తే కాలం కలిసొస్తుందని నమ్మకం. అందుకే రైతులు ఏరువాకను ఓ సంప్రదాయ పండుగగా జరుపుకొంటారు.

***జ్యేష్ఠ పూర్ణిమ విశిష్టత..***

నాగలి సారించి పనులు ప్రారంభించడానికి మంచి నక్షత్రం జ్యేష్ఠం అని జ్యోతిష్యశాస్త్రం చెబుతున్నది. ఈ నక్షత్రం చంద్రుడు కూడి ఉండే రోజు కావడం ఎంతో విశేషం. చంద్రుడు ఓషదులకు అధిపతి. ఓషదులు అనగా మంచు, ఎరువు, సూక్ష్మధాతువులు అని అర్థం. ఇవన్నీ ఉంటేనే వ్యవసాయం ఫలసాయాన్ని ఇస్తుందన్న నమ్మకంతో జ్యేష్ఠపౌర్ణమి రోజునే వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు.

***పండుగ జరుపుకొనే విధానం..***

ఆరుగాలం కష్టించే రైతన్నలకు తోడుగా వారి కష్టాల్లో భాగం పంచుకుంటూ అన్ని విధాలా అండగా ఉండే పశువులకు ఏరువాక పౌర్ణమి రోజు గ్రామాల్లో ఉదయాన్నే చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లి స్నానాలు చేయించి వాటి కొమ్ములకు రంగులను పూస్తారు. కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు, కుచ్చులు కట్టి శరీరం నిండా రంగులు అద్దుతారు. ఆర్థిక స్థోమత ఉన్న రైతులు ఎద్దులను నూతన వస్త్రాలతో అలంకరించి ఇంట్లో ఉన్న గాటి వద్దకు తీసుకొస్తారు. పండు గ సందర్భంగా చేసిన పొంగలిని నైవేద్యంగా పెట్టి ఆ గాటికి దూప, దీపాలతో పూజలు చేసి చల్లంగా చూడమని వేడుకుంటారు. సాయంకాలం మంగళవాయిద్యాలతో ఊళ్లో ఉన్న పశువులన్నింటినీ ఒక దగ్గరకు చే రుస్తారు. అక్కడి నుంచి పశువుల ఊరేగింపు ప్రజల కే రింతల మధ్య కనుల పండుగగా సాగుతుంది. ఎద్దులతోపాటు నాగలిని ఎర్రమట్టి, చున్నం పట్టెలతో అలంకరించి పొలం వద్దకు వెళ్తారు. ఈ ఏడాది రైతు కుటుంబంలో ఎవరి పేరుపైన బలం ఉందో వారు దుక్కిని దు న్ని పొలం పనులు ప్రారంభిస్తారు.

***ఏరువాక తాడు తెంచడం..***

దుక్కి దున్నడానికి వెళ్లే ముందు ఊరి పొలిమేరలో పుంటి నారతో తోరణాన్ని కడతారు. ఆ తోరణానికి రూపాయలు, జిలేబీలు, గారెలు, గజ్జెలు తదితర వస్తువులను రైతులు అలంకరిస్తారు. వాటిని చెర్నకోలతో కొడుతూ ఎవరికి దొరికిన వస్తువును వారు తీసుకెళ్తుంటారు. ఈ విధంగా చేయడం వల్ల పశువులకు మేలు కలుగుతుందని రైతుల నమ్మకం. దీనినే ఏరువాక తాడు తెంచడం అని అంటారు. ఈ ఆచారాన్ని, పండుగను విష్ణు పురాణంలో సీత యజ్ఞంగా పిలువబడేదని ప్రతీతి.

***పండుగకు సర్వం సన్నద్ధం..***

ఏరువాక పండుగను ఘనంగా నిర్వహించేందుకు నడిగడ్డ ప్రజలు సన్నద్ధమవుతున్నారు. దీంతో శుక్రవారం జిల్లా కేంద్రం గ్రామాల ప్రజలతో కిక్కిరిసి పోయింది. ఉత్సవాలకు సంబంధించిన వాటిని కొనుగోళ్లు చేయడంలో నిమగ్నమయ్యారు. గ్రామ దేవతలకు సమర్పించేందుకు సంత రోజు కాకపోయిన కోళ్ల కొనుగోళ్లు కూడా జోరుగా సాగింది. అలాగే గ్రామ దేవతలైన సుంకులమ్మ, ఈదమ్మ అమ్మవార్ల ఆలయాలను ముస్తాబు చేశారు. చింతలపేటలో ఏరువాక తాడు తెంచే ఉత్సవం, ఎద్దుల ఊరేగింపునకు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు చేస్తున్నారు.



ఎద్దులను పరుగెత్తిస్తున్న రైతులు

## ఘనంగా ఉత్సవాలు

మరికల్ , జూన్ 21 : మరికల్‌తోపాటు మాద్వార్, పెద్దచింతకుంట తదితర గ్రామాల్లో శుక్రవారం రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన అనంతరం పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించి చెర్నకోలతో ఏరుకతాడు తెంపించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.